క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: హుకుంపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. సావిత్రీనగర్, హుకుంపేట, వరలక్ష్మి కాలనీ, జనచైతన్య నగర్, రామకృష్ణనగర్, ఆదర్శనగర్, బాలాజీపేట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న అధ్యాపకుడు డాక్టర్ రవికుమార్

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సేవాశిబిరంలో భాగంగా గురువారం తొర్రేడు సొసైటీ సమావేశ మందిరంలో పెరటి తోటల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రవికుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం వివిధ రకాల కూరగాయల విత్తనాల కిట్లను అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్, తొర్రేడు సొసైటీ అధ్యక్షుడు చిట్టూరి వెంకటరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణలు చేతుల మీదుగా అందించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు వ్యవసాయ ప్రదర్శనలు, శాస్త్రవేత్తలు – రైతుల ఇష్టాగోష్ఠి, ఎన్‌ఎస్‌ఎస్ సేవాపథకం ముగింపు కార్యక్రమం జరుగుతుందని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.హైమజ్యోతి తెలిపారు.

పేదల సేవకు సహృదయ ఫౌండేషన్

రాజమహేంద్రవరం సిటీ: పేదలకు సాయం చేయాలన్న లక్ష్యంతో సహృదయ ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర నాయకుడు మరుకుర్తి నరేష్ కుమార్ యాదవ్ అన్నారు. ఫౌండేషన్ ప్రారంభం సందర్భంగా గురువారం సీటీఆర్ఐ రోడ్డు భాస్కర నగర్ బాల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మరుకుర్తి రవి యాదవ్, గోవింద రాజు, కోటిబాబు, గుదే రఘు నరేష్, అడబాల రాజు, దొరబాబు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు వాక్యంతో మానవాళికి శాంతి



మాట్లాడుతున్న శామ్యూల్ కిరణ్

సీటీఆర్ఐ: ఏసుక్రీస్తు వాక్యం వినడం ద్వారా మానవాళికి శాంతి కలుగుతుందని రెవరెండ్ డాక్టర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. గురువారం స్థానిక సూర్య ఫంక్షన్ హాల్లో మూడోరోజు బైబిల్ మిషన్ మహాసభలు నిర్వహించారు. శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ మూడు రోజులుగా అనేక వేలమంది క్రీస్తునామాన్ని బలపరిచి శాంతిని, సమాధానాన్ని పొందారన్నారు. పి.జాన్ దేవదాసు, సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం లక్ష్యం సాధించాం

బిక్కవోలు: మండలంలోని ఉపాధి హామీ పనుల్లో నూరు శాతం లక్ష్యం చేరుకున్నట్లు ఉపాధి హామీ ఏపీవో జి.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో కూలీలకు 3,50,320 పని దినాలు కల్పించడం లక్ష్యం కాగా 3,51,642 పని దినాలు కల్పించామన్నారు.

5న వాహనాలకు వేలం

మధురపూడి: కోరుకొండ సెబ్ స్టేషన్‌లోని 30 వాహనాలకు ఏప్రిల్ 5వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 28 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు వేలం నిర్వహిస్తామన్నారు.

తంటికొండ వెంకన్నకు రూ.8.34 లక్షల ఆదాయం

గోకవరం: మండలంలోని తంటికొండ వేంటేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని అధికారులు లెక్కించారు. ఆలయంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారని, దీనిపై విచారణ నిర్వహించిన తరువాతే హుండీ ఆదాయం లెక్కించాలని కొద్దిరోజుల క్రితం హుండీ లెక్కింపును దేవస్థానం చైర్మన్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో గురువారం దేవదాయశాఖ తనిఖీ అధికారుల పర్యవేక్షణలో భక్తులు, పోలీసు సిబ్బంది సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. మొత్తం ఆరు నెలల కాలానికి హుండీల ద్వారా రూ.8,03,313 ఆదాయం వచ్చింది. గతంలో ఆలయ ప్రాంగణంలో శీలు వేసిన పరకామణి హుండీ లెక్కించగా రూ.31,362 ఆదాయం వచ్చింది. మొత్తం హుండీల ద్వారా రూ.8,34,675 ఆదాయం వచ్చిందని, గతంతో పోల్చితే ఆదాయం పెరిగిందని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.



ధవళేశ్వరం లాక్‌లైన్ క్వార్టర్స్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న సీతఈ సుధాకరబాబు దంపతులు



నగరంలో బాలాంజనేయస్వామిని దర్శించుకున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి



బొమ్మూరు సంతాన సీతారాముల ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఉషారాణి దంపతులు



దుళ్లలో సీతారాముల కల్యాణం

సమస్తం.. సీతారామం..

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- వాడవాడలా సీతారాముల కల్యాణాలు
- తరలివచ్చిన భక్తులు

సీటీఆర్ఐ: శ్రీరామనవమి పర్వదినాన్ని గురువారం రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. నగర పరిధి సీతంపేటలోని రామాలయంలో, జాంపేట వద్ద గల కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణం అనంతరం సీతారాములను పల్లకీలో ఊరేగించారు. రామనవమి సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన కల్యాణోత్సవాలకు రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 50వ డివిజన్ భాస్కర నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు గుద్దే రఘు నరేష్ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తుల మురళీధర్ ముమ్మిడి వీరబాబు పల్లం రాజు ఎం.శేఖర్ పాల్గొన్నారు

టీడీపీ ఆధ్వర్యంలో..

నగరంలో టీడీపీ ఆధ్వర్యంలో పలుచోట్ల సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ సీతారాములను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

వాడవాడలా వైభవంగా..

రాజమహేంద్రవరం రూరల్: శ్రీరామనవమి వేడుకలు నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా జరిగాయి. కొంతమూరు, హుకుంపేట రామాలయాల్లో నిర్వహించిన సీతారాములు కల్యాణోత్సవాలను జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు తిలకించారు. బొమ్మూరు వెంకటగిరికొండపై సంతాన సీతారాముల ఆలయంలో వేడుకలు జరిగాయి. ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ టీవీఎస్ఎన్ మూర్తి, ఉషారాణి దంపతులు పీటలపై కూర్చున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.



ధవళేశ్వరం గొల్లపేటలో సీతారాములకు పూజలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

యాదవోలుకు చెందిన కోలాటం ఆకట్టుకుంది. వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పీఠానికి గరిమెళ్ల వెంకట రమణశాస్త్రి సిద్ధాంతి, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి వినిశ్చలానంద మహరాజ్, ఆలయ గౌరవాధ్యక్షుడు, విశ్రాంత ఎస్ఈ చింతా సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు దాట్ల శ్రీధర్ వర్మ, సంపూరి దేవయ్య, అచ్యుతాచారి పాల్గొన్నారు.

హుకుంపేట కోదండ రామాలయంలో..

హుకుంపేట రావిచెట్టు సెంటర్‌లోని కోదండ రామాలయంలో కురుమళ్ల వినోద్ కుమార్, రమాదేవి దంపతులు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు ఐదువేల మందికి అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు. బొమ్మూరు పంచాయతీ వీధిలోని రామాలయంలో మద్దిపోటి రాము, సుజాత దంపతులు కల్యాణం నిర్వహించారు.

కన్నుల పండువగా..

కడియం: మండలంలోని పలు ఆలయాల వద్ద సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. వీరవరంలోని కోదండ రామాలయంలో జరిగిన కల్యాణోత్సవానికి విశేష సంఖ్యలు భక్తులు హాజరయ్యారు. దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కడియం గిరజాల వీధిలోని రామాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. కడియపులంక ఒడ్డుకింద రామాలయం, బుర్రిలంక రామాలయం, మాధవరాయుడు పాలెం, దుళ్లలోని ఆర్యవైశ్య రామాలయం, వంతెన సెంటరు, పాత రామాలయం, వేమగిరి తోట ఆలయాల వద్ద కల్యాణం జరిపించారు. అలాగే ఆయా ఆలయాల వద్ద భారీ అన్నదానాలు నిర్వహించారు. వేమగిరితోట సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా రథోత్సవం జరిగింది. మాధవరాయుడు పాలెంలో సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. వుంతలో ముసలమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 250 కేజీల బెల్లంతో పానకం తయారు చేసి పంపిణీ చేశారు. హిందూధర్మ ప్రచార సమితి సభ్యులు కడియం అరుంధతీపేట రామాలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. మురమండలోని



ఆల్కాట్‌తోట రామాలయంలో అన్నదానం చేస్తున్న గొందేశి శ్రీనివాసులు రెడ్డి

రామాలయాల్లో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గొల్లపేటలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. సచివాలయం కోఆర్డినేటర్ సాధనాల చంద్రశేఖర్ (శివ), వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, శ్రీరంగం బాలరాజు, సత్యం వెంకటరమణ, ముత్యాల జాన్ పాల్గొన్నారు.

ధవళేశ్వరం లాక్‌లైన్ క్వార్టర్స్‌లోని రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. పోలవరం ప్రాజెక్టు సీఈ బుర్రి సుధాకరబాబు, జయకుమారి దంపతులు పీటలపై కూర్చున్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు స్వామివారిని దర్శించుకున్నారు. బస్టాండ్ సెంటర్‌లో జరిగిన వేడుకలకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్య అతిథి విచ్చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మిరప రమేష్ పాల్గొన్నారు. ఎర్రకొండపై జరిగిన వేడుకలకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బోడపాటి కుమార్, బొడ్డేటి శివాజీ పాల్గొన్నారు. టిడ్కో గృహాల వద్ద జరిగిన శ్రీరామనవమి వేడుకలకు రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి విచ్చేశారు.

ప్రకాశం నగర్: లలితా నగర్‌లో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌తోటలోని రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న గుడ్లవారి వీధిలో శ్రీపీఠం మఠాధిపతులు పరిపూర్ణనందస్వామి ప్రతిష్ఠించిన రామాలయంలో ఆలయ ధర్మకర్త ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం సీతారాముల కల్యాణం జరిగింది.



వేమగిరితోటలో స్వామివారి రథోత్సవం



సీతంపేట రామాలయంలో వేడుకలు



స్వామి వారి పల్లకీని మోస్తున్న టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి శ్రీనివాసు తదితరులు

రామనామమే మానవులకు రక్షణ కవచం



సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్



బైక్ ర్యాలీలో పాల్గొన్న భక్తులు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- వైభవంగా శ్రీరామ శోభాయాత్ర బైక్ ర్యాలీ

సీటీఆర్ఐ: రామనామమే మానవాళికి రక్షణ కవచమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలో గురువారం జరిగిన శ్రీరామ శోభాయాత్ర బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. పుష్కరఘాట్ నుంచి ఆర్యాపురం, నందం గనిరాజు జంక్షన్, గోరక్షణపేట, ఏవీఏ రోడ్డు, పాత సోమాలమ్మ ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేడియం రోడ్డు మీదుగా సుమారు పది కిలోమీటర్ల మేర యాత్ర జరిగి, మళ్లీ పుష్కరఘాట్‌కు చేరుకుంది. అందరిలోనూ సోదర భావం వెల్లివిరియాలని, భారతీయ సంప్రదాయాలు, కట్టుబాట్లు అందరికీ తెలిసేలా హిందూధర్మం పరిఢవిల్లేలా శోభాయమానంగా ఈ యాత్ర జరుగుతుందని శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ ప్రవచించారు. పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ప్రతి పురుషుడూ రామచంద్ర ప్రభువుకున్న సుగుణాలను అలవర్చుకోవాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం, ధర్మాన్ని కాపాడటం ఉత్తమ పురుషుల లక్షణమన్నారు. రాముడు జన్మించిన అయోధ్యలో ఆలయ పునర్నిర్మాణం అత్యంత అద్భుతంగా జరుగుతోందన్నారు. అంతకు ముందు రథంపై ఉన్న సీతారాముల మూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండేపూడి సురేష్, బండ్ల శంకర్, కామవరపు శ్రీరామ్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, రామ్‌సాయి దీపు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: సేవాగుణమే సమాజంలో గుర్తింపు తెస్తుందని, ప్రజా సేవా కార్యక్రమాలు ఎవరు చేసినా వారికి తన ప్రోత్సాహం, సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. గురువారం స్థానిక దేవీచౌక్ సెంటర్లో ధనాన్ని నారాయణమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ఇరవై సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శ్రీదేవి కాంక్రీట్ లేబర్ వర్కర్స్ యూనియన్ నేతలు గిడుతూరి నాగు, కంచి అప్పన్నను అభినందించారు.

కేసులు ఎత్తివేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

సీటీఆర్ఐ: జిల్లా విభజన సమయంలో కోనసీమలో జరిగిన అల్లర్లలో శెట్టిబలిజ యువతపై నమోదు చేసిన కేసులను ఉపసహరిస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరుమార్చిన సమయంలో జరిగిన అల్లర్లతో సంబంధం లేని అమాయక శెట్టిబలిజ యువకులు, విద్యార్థులను కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెట్టారని చెప్పారు. వీటన్నింటిని ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఇటీవల మంత్రి పినిపే విశ్వరూప్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ద్వారా సీఎం జగన్‌ను కలిసి వివరించారన్నారు. దీనిపై పెద్ద మనసుతో స్పందించిన సీఎం జగన్ ఆ కేసులను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారని హర్షం వ్యక్తం చేశారు. ఇది ఎమ్మెల్సీగా ఇటీవల ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావు తొలి విజయమని మేడిశెట్టి తాతబ్బాయి సంతోషం వ్యక్తం చేశారు. సానబోయిన రామారావు మాట్లాడుతూ కేసుల్లో ఇరుక్కుంటే యువత భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతుందని సీఎం జగన్‌కు వివరించి, కేసుల ఎత్తివేతకు కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుబ్బల ఉదయ్ భాస్కర్, మట్టపర్తి సత్యనారాయణ, సంఘం ధవళేశ్వరం విభాగం గౌరవాధ్యక్షుడు బత్తిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సానబోయిన రామారావు తదితరులు

సినిమాలు



శ్యామల	:	భోలా
సూర్యమినీ	:	డంజన్స్‌డ్రాగన్స్
సూర్యప్యాలెస్	:	దసరా
స్వామి	:	దాస్‌కా ధమ్కీ
అశోక	:	దసరా
శివజ్యోతి	:	రంగమార్తాండ
అనుశ్రీ	:	దసరా
రాజా	:	దసరా
ఊర్వశి	:	సత్యంవధ–ధర్మంచెర, దహనం
రంభ	:	డంజన్స్ డ్రాగన్స్
గీతాఅప్సర	:	దసరా
నామవరం		
వీఎస్ మహల్	:	దసరా
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	దసరా

ముగిసిన మహాసభలు



మాట్లాడుతున్న విజయరాజు

సీటీఆర్ఐ: క్వారీ మార్కెట్ సమీపంలో మూడు రోజులుగా జరుగుతున్న బైబిల్ మిషన్ 56వ మహాసభలు గురువారం ముగిశాయి. చివరి రోజు బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎస్.విజయరాజు మాట్లాడుతూ ఈ మహాసభలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ నుంచి 15 వేల మందికి పైగా హాజరయ్యారన్నారు. తన తండ్రి స్వర్గీయ సుదర్శనరావు రాజమహేంద్రవరంలో ప్రారంభించిన ఈ మహాసభలు దేవుని మహిమార్థమై విజయవంతంగా సాగుతున్నాయన్నారు. వీటికి సహకరించిన కేథడ్రల్, గోల్డెన్ జూబ్లీ, స్వస్థతశాల సంఘ పెద్దలకు, విశ్వాసులకు అభినందనలు తెలిపారు. డి.సువర్ణరాజు వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో ఆనందపాల్, షాలేము రాజు, పీజీ సుధాకర్, డాక్టర్ ఎన్.సిమ్యోన్ సుదర్శన్, ఎన్.విలియం బెంటిక్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

బిక్కవోలు: బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ గురువారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

కడియం ఆసుపత్రిలో విస్తృత వైద్యసేవలు

- నెలకు సుమారు 50 ఆపరేషన్లు
- ప్రతిరోజు 150 – 200 వరకూ ఓపీ సేవలు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా విస్తృత వైద్యసేవలు అందుతున్నాయి. నెలకు సుమారు 50 వరకూ ఆపరేషన్లు ఇక్కడ చేస్తున్నారు. అత్యాధునిక పరికరాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఉంది. దీంతో గతంలో కంటే ఇప్పుడు శస్త్రచికిత్సల సంఖ్య పెరిగిందని వైద్యులు తెలిపారు. గైనిక్, జనరల్ మెడిసిన్ విభాగాలతో పాటు, కళ్లు, దంతాలు, నియోనేటల్ వంటి ఆరుగురు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉన్నారు. వీరే కాకుండా అనస్తీషియా, ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ 150 నుంచి 200 మంది వరకు ఆసుపత్రి సేవలను ఔట్ పేషెంట్లుగా వినియోగించుకుంటున్నారు. అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉన్నాయి.

మండల పరిధిలో..

కడియం మండలం పరిధిలోని 11 గ్రామ పంచాయతీల్లో దాదాపు లక్షమందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ముఖ్యంగా కడియపులంక, వేమగిరి, కడియం మేజర్ గ్రామాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సాధారణ వ్యాధులతోపాటు, పాముకాటు, కాలిన గాయాలు వంటి అత్యవసర చికిత్సల విషయంలో కూడా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వెంటనే స్పందించి వైద్యసేవలు అందజేస్తున్నారు. రోగి ఆరోగ్యస్థితిని బట్టి ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అవసరమైతే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. తల్లీబిడ్డలకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేందుకు అంబులెన్స్‌ను కూడా ఆసుపత్రి ఆవరణలో సిద్ధంగా ఉంచారు. కొత్త భవనం అందుబాటులోకి రావడంతో మరిన్ని బెట్లు సిద్ధం చేస్తున్నారు.



కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

అందుబాటులోకి నూతన భవనం

గతంలో అన్నిరకాల వ్యాధులు ఉన్నవారినీ ఒకేహాల్లో ఉంచి వైద్యం అందించేవారు. దీనివల్ల ఇన్‌ఫెక్షన్లు త్వరగా వ్యాప్తి చెందుతాయన్న భయం అటు వైద్యులు, ఇటు రోగులకు కూడా ఉండేది. అయితే నూతన భవనం అందుబాటులోకి రావడంతో స్త్రీలు, పురుషులు, చిన్న పిల్లల వార్డులను విడివిడిగా ఏర్పాటు చేశారు. రోగులను ఇన్‌పేషెంట్లుగా ఉంచి వైద్యం అందించేందుకు అవకాశం ఏర్పడింది. ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యుల నుంచి శానిటేషన్ సిబ్బంది వరకు పూర్తిస్థాయిలో ప్రభుత్వం నియమించింది. ఆసుపత్రి ప్రాంగణమంతా పరిశుభ్రంగా కన్పిస్తోంది. ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యసిబ్బంది అందుబాటులో ఉండడం, సేవలు బాగుండడంతో ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చి ప్రభుత్వ వైద్యసేవలు పొందే వారి సంఖ్య పెరుగుతోంది.

సంతృప్తికర సేవలు

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు సంతృప్తికర సేవలు అందిస్తున్నాం. గతంలో ఆసుపత్రి నిర్వహణ, సిబ్బంది పనితీరుపై అనేక ఫిర్యాదులు వచ్చేవి. అయితే పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించడంతో పాటు, కావాల్సిన పరికరాలను కూడా మంజూరు చేశారు. దీంతో ఆసుపత్రి ద్వారా గతాని కంటే మరింత మెరుగైన సేవలు అందించగలుగుతున్నాం. సున్నితమైన శరీరభాగాల్లో కూడా శస్త్రచికిత్సలు చేసేందుకు కూడా కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో అవకాశం ఉంది. అందుకు సంబంధిన వైద్యులు త్వరలోనే అందుబాటులోకి రానున్నారు.

– డాక్టర్ శ్రీధర్, వైద్యాధికారి, కడియం ప్రభుత్వాసుపత్రి